అన్నదానం నిర్వహిస్తున్న నిర్వాహకులు

ఆలయంలో అన్నదానం

రెబ్బెన, జనవరి 14: రెబ్బెన, జనవరి 14: మండలంలోని ఇందిరానగర్ గ్రామంలో కొలువైన శ్రీ కనకదుర్గాదేవి స్వయంభు మహంకాళి ఆలయంలో ఆదివారం ఆలయ అర్చకుడు దేవర వినోద్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించిన అనంతరం భక్తులు అన్నదానంలో పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు: ఎస్ఐ

పెంచికల్‌పేట్, జనవరి 14: సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కొమురయ్య ఆదివారం పత్రిక ద్వారా హెచ్చరించారు. సంక్రాంతి వేడుకలను సంప్రదాయంగా కుటుంబసభ్యులతో ఆనందంగా జరుపుకోవాలని అన్నారు. మండలంలో ఎవరైనా కోడిపందాలు, పేకాట,అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా కోడి పందాలు,జూదం ఆడుతున్నట్లు తెలిస్తే 100 లేదా 9849 668808 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

ఎంపికైన విద్యార్థితో ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 14: జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి మంతెన విష్ణువర్ధన్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఈనెల 16 నుంచి 18 వరకు పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో జనగాంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో అండర్-14 విభాగంలో విష్ణువర్ధన్ పాల్గొంటాడని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విష్ణువర్ధన్‌ను ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్, ఎస్జీఎఫ్: జిల్లా సెక్రటరీ సాంబశివరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు బి.తిరుపతి, ఉపాధ్యాయులు అభినందించారు.

అక్షింతల పంపిణీ

బెజ్జూర్ : అక్షింతలను పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

బెజ్జూర్, జనవరి 14 : మండల కేంద్రంలో ఆదివారం అయోధ్య పూజిత అక్షింతలను పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని రంగనాయక ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా వారం క్రితం అందిన ఈ అక్షింతలను శివాలయంలో భద్రపర్చారు. త్వరలో అయోధ్యలో రామ మందిర ప్రారంభోత్సవం ఉండడంతో అక్షింతలను ఆదివారం ఇంటింటా పంపిణీ చేయడానికి శోభాయాత్ర నిర్వహించి అక్షింతలు అందజేశారు.

గొంతెమ్మ (గౌతమిదేవి) ఇతర దేవతలతో పూజారులు

నిసానులతో గ్రామంలో తిరుగుతున్న భక్తులు



సిద్ధేశ్వర గుహల్లో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

గిరిజనుల ఆరాధ్య దైవం గొంతెమ్మ

- నేడు బోనాలు
- నెల రోజుల పాటు గ్రామాల్లో ఆటాపాటలు
- సిద్ధేశ్వర గుహల్లో ప్రత్యేక స్నానాలు
- ఆచారం ప్రకారమే నిర్వహణ

ఇల్లారులో నూతనంగా కొలువుదీరిన విగ్రహాలు

సిద్ధేశ్వర నీటిగుండాల్లో దేవాల్లతో స్నానాలు చేస్తున్న పూజారులు

పెంచికల్‌పేట్, జనవరి 14 : అటవీ ప్రాంత గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు ,ఆచారాలు, పద్ధతులు మారుమూల గ్రామాల్లో నేటికీ స్థిరంగా కొనసాగుతున్నాయి. ఆనాటి పెద్దలు పాటించిన పద్ధతుల ద్వారా వారి ఆరాధ్య దైవాలను కొలుస్తున్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్ పేట్ మండలంలోని ఎల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంత మారుమూల గిరిజన గ్రామం మేరగూడ సమీపాన దట్టమైన అడవిలో 200 సంవత్సరాల క్రితం వెలిసింది. దేవున్ని గుర్తించిన నాటి గిరిజన పెద్దలు నేటి వరకు ఆరాధ్య దైవంగా గొంతెమ్మను (గౌతమిదేవి) కొలుస్తున్నారు. అప్పటినుంచి అమ్మవారికి భక్తులు మొక్కులు తీర్చుకుంటున్నారు. ఈ సంవత్సరం కొన్ని కొత్త దేవతల విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఇల్లారిలోని దేవతలను నిసానులను నెల రోజులపాటు గ్రామాల్లో తిప్పుతారు. రాత్రి దేవతలతో ప్రధాన చౌరస్తాల్లో ఆటపాట నిర్వహిస్తారు. అదే పరిధిలో గల దట్టమైన గుట్టల్లో అతి పురాతనమైన సిద్ధేశ్వర గుహల్లో గల భారీ నీటి గుండాల్లో స్నానాలు చేయించి అక్కడే ఒకరోజు రాత్రి నిద్ర చేస్తారు. ప్రతి సంవత్సరం పూర్వీకుల ఆచారం పద్ధతుల ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆలయ పూజారి మనెపల్లి రాజన్న, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆలయం వద్ద ఘనంగా బోనాల నిర్వహిస్తారు. అక్కడికి కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలోని కొన్ని మండలాల భక్తులు వచ్చి బోనం, ఓడి బియ్యంతో మొక్కులు తీర్చుకుంటారు. బోనాల రోజు బొమ్మల దుకాణాలు,తిను బండరాల దుకాణాలు,భక్తుల సందడితో జాతరను తలపిస్తుంది. అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటే కొంగుబంగారమై నిలుస్తుందని భక్తుల విశ్వాసంగా నమ్ముతారు.

అమ్మవారికి బోనంతో మొక్కులు చెల్లిస్తాం

గొంతెమ్మ అమ్మవారికి చుట్టు పక్కల గ్రామాల్లోని ప్రజలు అమ్మవారికి మొక్కులు చెల్లిస్తారు. వర్షాకాలంలో పండించిన కొత్తవడ్ల బియ్యం, బెల్లంతో బోనం సమర్పించుకుంటారు. బోనంతో మొక్కులు తీర్చుకుంటే కుటుంబీకుల ఆరోగ్యం, పాడిపంట చల్లంగా ఉంటుందని ప్రగాఢ విశ్వాసంతో నమ్మి మొక్కులు తీర్చుకుంటారు. ఇప్పటివరకు నాటి పెద్దల పద్ధతులు, నమ్మకాలను పాటిస్తున్నాం. అమ్మవారు అందరిని చల్లంగా చూస్తున్నది.

- సిడెం అశోక్, గోండ్వానా గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

పూర్వీకుల ఆచారాలను కొనసాగిస్తున్నాం

అటవీ ప్రాంత మారుమూల గిరిజన గ్రామం మేరగూడ సమీపంలో గల గొంతెమ్మ (గౌతమి దేవి) మా తాతలు, తండ్రుల నుంచి ఆరాధ్య దైవంగా కొలుస్తున్నాం. నేటికీ పూర్వీకుల ఆచారం ప్రకారం దేవతలను ఆటాపాట నిర్వహించి గ్రామాల్లో తిరుగుతూ సిద్ధేశ్వర గుహలోని భారీ నీటి గుండాల్లో స్నానాలు చేయించి అనంతరం బోనాల పండుగ ఘనంగా నిర్వహిస్తాం. అమ్మవారిని నమ్మిన భక్తులకు బోనాలతో మొక్కులు తీర్చుకుంటారు. మొక్కిన వారికి కొంగుబంగారంగా నేటికీ నిలుస్తున్నది.

- మానెపల్లి రాజన్న ఆలయ పూజారి, ఎల్లూరు

కనులపండువగా భోగి వేడుకలు

రెబ్బెన, జనవరి 14 : మండలంలో భోగి వేడుకలను ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం పూట మహిళలు తమ ఇంటి ముందు వేసిన రంగవళ్లులు ఆకట్టుకున్నాయి. చిన్నారులు పతంగులు కొనుగోలు చేసి ఖాళీ ప్రదేశాల్లో ఎగురవేస్తూ సంబురాలు జరుపుకున్నారు. రైతులు సంక్రాంతిని అంగరంగ వైభవంగా జరుపుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు.

● తిర్యాణి మండలంలో..

తిర్యాణి, జనవరి14 : మండలంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆదివారం భోగి పండుగను మహిళలు ఘనంగా జరుపుకున్నారు.ఆడపడుచులు ఉదయం తెల్లవారకముందే కళ్లాపి చల్లి వాకిట్లో రకరకాల రంగు రంగుల ముగ్గులు వేశారు. ముగ్గుల మధ్యలో ఆవుపేడతో గొబ్బెమ్మలుగా చేసి బంతిపూలు,రేగుపళ్ళు,నవధాన్యాలతో అలంకరించారు. చిన్నారులు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని రేగుపళ్లు ఇతర పదార్థాలతో కూడిన భోగి స్నానాలు చేయించారు. మంగి, పంగిడిమాధర,గంభీరావుపేట,తిర్యాణి, రోంపల్లి, భీమారం, చింతపల్లి, గడలపల్లి,రాళ్లకన్నేపల్లి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పిండివంటలు చేసుకున్నారు.చిన్నా,పెద్ద తేడా లేకుండా గాలిపటాలను ఎగురవేసి సంబురాలు జరుపుకున్నారు. గిరిజనులు సంప్రదాయం ప్రకారం భోగి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

గోలేటిలో గాలిపటాలు కొనుగోలు చేస్తున్న చిన్నారులు

● లింగాపూర్ మండలంలో..

లింగాపూర్, జనవరి14: మండలకేంద్రంతో పాటు పిట్టగూడ, జామల్‌ధార, మాన్కుగూడ, పిక్లతండా, చిన్నదాంపూర్, లొద్దిగూడ ,కొత్తపల్లి,కంచన్‌పల్లి తదితర గ్రామాల్లో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆదివారం భోగి పండుగను మహిళలు ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. చిన్నా,పెద్ద తేడా లేకుండా గాలిపటాలను ఎగురవేశారు. గిరిజనులు సంస్కృతి సంప్రదాయం ప్రకారం భోగి వేడుకలను జరుపుకున్నారు.

● బెజ్జూర్ మండలంలో..

బెజ్జూర్, జనవరి 14 : మండలంలో ఆదివారం సంక్రాంతి సందడి నెలకొంది. ఆదివారం భోగి సందర్భంగా ఇండ్లలో పిండి వంటలు, ఇంటి గుమ్మాల ముందర ముగ్గులు వేయడం తదితరాలతో ఏ ఊళ్లో చూసినా సందడిగా కనిపించారు. అదే విధంగా మండల కేంద్రంలో ఆదివారం వారసంత కావడంతో సోమవారం నిర్వహించే సంక్రాంతి పండుగ సందర్భంగా కావలసిన సామగ్రి కొనుగోళ్లతో అందరూ సందడిగా కనిపించారు.

కూలీల కొరతతో చేనులోనే ఉన్న పత్తిపంట

మగ్గిపోతున్న తెల్ల బంగారం

రెబ్బెన, జనవరి 14: మండలంలో ఏ గ్రామంలో చూసిన పత్తి పంట చేలల్లోనే దర్శనమిస్తున్నది. కూలీల కొరత అధికంగా ఉండడంతో పత్తి తీసేవారు లేక పత్తి పంట చేలలోనే మగ్గిపోతున్నది. చేతికి వచ్చిన పత్తి ఇంటి వరకు చేరకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థికసాయం

కౌటాల, జనవరి 14: కాగజ్‌నగర్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న బాబాసాగర్ గ్రామానికి చెందిన హోంగార్డ్ అల్లూరి పోచం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు సీఐ రాణాప్రతాప్ సిబ్బంది హోంగార్డు కుటుంబానికి వారి కుటుంబానికి సానుభూతి తెలిపి 10వేల నగదు, క్వింటాల్ బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యంగా ఉండాలని వారు తెలిపారు. వారి వెంట ఎస్సై సందీప్ పోలీస్ సిబ్బంది గణేశ్, మధు, రమేశ్, సంజీవ్ ఉన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

కౌటాల, జనవరి 14 : మండలంలోని మొగడ్‌ధగడ్ గ్రామంలో గ్రామీణ స్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈకబడ్డీ పోటీలను గ్రామంలోని ఆశ్రమోన్నత పాఠశాల క్రీడా మైదానంలో మ్యాట్‌పై ఆడించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో రెండు విభాగాలు 60 కిలోల, 54 కిలోల బరువు గల గ్రూపులను ఆడించనున్నట్లు వారు తెలిపారు. ఈ పోటీలను సర్పంచ్ ఏర్వత్ జీజాబాయి, ఎంపీటీసీ బొమ్మకంటి మనీష్, ఉపసర్పంచ్ బదన్ కల్పన, వాను పటేల్, నిర్వాహక కమిటీ సభ్యులు ప్రవీణ్, భాస్కర్, మహేందర్, ఉమేశ్ తో కలిసి ప్రారంభించారు.

ఘనంగా మరట్వాడ నామాంతర్ దివస్

వాంకిడి,జనవరి14: మండల కేంద్రంలో ఆదివారం మరట్వాడ విద్యాపీఠ్ నామంతర్ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.1994 సంత్సరంలో 14 జనవరిలో ఔరంగాబాద్‌లోని మరట్వాడ విద్యాపీఠానికి డా॥బీఆర్ అంబేద్కర్ మరట్వాడ విశ్వవిద్యాలయంగా పేరు మార్పు చేశారని,(బీఎస్ఐ) జిల్లా అధ్యక్షుడు అశోక్ మహుల్కర్, మండల భారతీయ బౌద్ధ మహాసభ అధ్యక్షుడు జైరాం ఉప్రేలు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1977 జూలై 7 గౌతం వాగ్మారే డిగ్రీ చదువుతున్న సమయంలో చేసిన పోరాటంలో విద్యాపీఠానికి అంబేద్కర్ పేరు పెట్టాలని ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆహుతి అయ్యాడని, దీంతో మహారాష్ట్ర ప్రభుత్వం 1994 జనవరి 14న ఆవిద్యా పీఠానికి పేరు ప్రకటించారని పేర్కొన్నారు. అనంతరం మండల కేంద్రంలో నిర్మించ తలపెట్టిన బుద్ధ విహార్ పనులను సంఘం పెద్దలు పునర్: ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు శ్యామ్ రావు దుర్గం,మార్కెట్ కమిటీ డైరెక్టర్ రోషన్, విలాస్,విఠల్ రమేశ్,ప్రతాప్,నాగ్సేన్,రాకేశ్, రాజేశ్వర్,పాండు,దర్మ, ప్రదీప్,నానాజీ,ఉప్రే బల్వంత్ రావు,తుకుడు,చేతన్ పాల్గొన్నారు.

వాంకిడి: అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

అటవీజంతువుల కోసం అమర్చిన తీగకు తగిలి

ఒకరి మృతి

- ఐదుగురు తీగ అమర్చినట్లు గుర్తించిన పోలీసులు

సిర్పూర్(యు) జనవరి 14 : అటవీ జంతువుల కోసం అమర్చిన విద్యుత్ తీగకు తగిలి ఓ వ్యక్తి మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యు) మండలం సెట్టిహడ్సునూర్ గ్రామ పంచాయతీలోని చప్రీలో జరిగింది. చప్రీకి చెందిన కొందరు వ్యక్తులు సమీపంలోని అటవీ ప్రాంతంలో జంతువులను చంపేందుకు విద్యుత్ తీగ అమర్చారు. శనివారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన కొట్నక భీంరావ్(40), మెస్రం బొజ్జు పొయ్యిల కట్టెల కోసమని అటవీప్రాంతానికి వెళ్లారు. భీంరావ్ కాళ్లకు వైరు తగలగా, విద్యుత్‌షాక్‌తో అక్కడికక్కడే చనిపోయాడు. బొజ్జు.. భీంరావ్‌ను తప్పించే యత్నం చేయగా ఫలితం లేక పోయింది. పోలీసులు, అటవీశాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఉట్నూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అదే గ్రామానికి చెందిన ఐదుగురు విద్యుత్ వైర్‌ను అమర్చినట్లు పోలీసులు గుర్తించారు. ఆదివారం వారిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ మల్లేశ్ తెలిపారు. కాగా, మృతునికి భార్య, కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఊరెళ్తున్నారా సమాచారమివ్వండి : ఎస్ఐ

వాంకిడి, జనవరి14 : సంక్రాంతి పడుగకు ఊరెళ్తే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ సాగర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త వారి కదలికలపై నిఘా ఉంచాలని,కాలనీలు,ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు శ్రేయస్కరమన్నారు. పండుగ సమయంలో చాలా మంది ప్రయాణాలు చేస్తారని, ఇదే అదునుగా దొంగలు చేతివాటం ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై డయల్ 100 లేదా వాంకిడి 8712670531కు ఫోన్ చేసి పోలీస్ లకు సమాచారం ఇవ్వాలన్నారు.

పీఆర్టీయూ టీఎస్ డైరీ ఆవిష్కరణ

కాగజ్‌నగర్ ఎస్పీఎం కాలనీ, జనవరి14 : కాగజ్‌నగర్ పట్టణంలో ఆదివారం పీఆర్టీయూ టీఎస్ డైరీని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలను వివరిస్తూ సంఘం జిల్లా ఆధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పదోన్నతులకు అడ్డంకిగా మారిన టెట్ అర్హత పరీక్షను సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలని, అర్హత మార్కులను సవరించాలని, సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్షను డిపార్ట్మెంటల్ టెస్ట్ లేవెల్లో నిర్వహించాలన్నారు. ప్రతి పాఠశాలకు సర్వీస్ పర్సన్‌లను నియమించాలని, ప్రభుత్వ పాఠశాలలో కూడా ఉచిత కరెంటు సౌకర్యం కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పత్తిపాక శ్రావణ్ కుమార్, మేడి లక్ష్మినారాయణ, చన్కపురే పురుషోత్తం, జాడి శ్రీనివాస్, రతన్ గైన్, రాంటెంకి బాబు రావు, జాడి దేవజీ, తంగెడిపల్లి రాకేశ్, రాజా కమలాకర్‌రెడ్డి, ముంజంపల్లి రమేశ్, ఇందాలపు ప్రకాశ్, గుళ్లపల్లి రవి శంకర్, జావేద్ అహ్మద్, కొయ్యడ శుభాశ్ గౌడ్, రామచందర్, దామోదర్, శ్రీకాంత్, లాలాజీ, మండల జిల్లా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల రక్షణ అందరి బాధ్యత

కాగజ్‌నగర్ : గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

కాగజ్‌నగర్, జనవరి 14: కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో ఉన్న పులుల రక్షణ అందరి బాధ్యత అని అటవీ శాఖ అధికారులు స్పష్టం చేశారు. కాగజ్‌నగర్ మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం అటవీ శాఖ అధికారులు అడవులు, పులులు, వన్యప్రాణులపై ప్రజలకు అవగాహన కల్పించారు. పశువులపై పులి దాడి చేసి హతమారిస్తే తక్షణ సహాయం కింద రూ.5 వేలు అందిస్తామని, ఆ తర్వాత ప్రభుత్వం నుంచి మంజూరయ్యే నష్ట పరిహారం అందిస్తామన్నారు. తమ పశువులపై పులి దాడి చేస్తుందని పులులను హతమార్చడం సరికాదని పేర్కొన్నారు. ఎఫ్ఎస్‌వోలు తిరుమల్, పోశెట్టి, గ్రామస్తులు ఉన్నారు.

● పెంచికల్‌పేట్ మండలంలో..

పెంచికల్‌పేట్,జనవరి 14 : వన్య ప్రాణుల సంరక్షణ మన అందరి బాధ్యత అని డిప్యూటీ రేంజ్ అధికారి ప్రభాకర్ అన్నారు. ఆదివారం మండలంలోని గుండెపల్లి,అగర్‌గూడ గ్రామాల్లో వన్యప్రాణుల సంరక్షణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరు కూడా వన్య ప్రాణులకు హాని తలపెట్టవద్దని సూచించారు. వన్య ప్రాణులను వేటాడం, విద్యుత్ తీగలు అమర్చడం, ఉచ్చులు బిగించడం, వలలు ఏర్పాటు చేయడం, విష ప్రయోగం వంటివి చేయడం నేరమన్నారు. పై వాటిలో నేరస్తులుగా పట్టుబడితే వన్య ప్రాణుల సంరక్షణ చట్టం 1972 ప్రకారం 3-7 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తామని తెలిపారు. వన్య ప్రాణుల దాడిలో పశువులు గాయపడినా, మృతి చెందిన తక్షణ ఆర్థికసాయం రూ.5 వేల అందించి నష్టపరిహారం కోసం ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని పేర్కొన్నారు. సర్పంచ్ సుధాకర్, ఎఫ్బీవో వెంకటేశ్ , వాచర్స్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గిరిజన యువత క్రీడల్లో రాణించాలి

లింగాపూర్: క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ అడె సవిత,జడ్పీటీసీ రక్కాబాయి

లింగాపూర్, జనవరి 14: గిరిజన యువత క్రీడల్లో రాణించాలని ఎంపీపీ అడె సవిత, జడ్పీటీసీ రక్కాబాయి అన్నారు. మండలంలోని గుమ్మూర్(బి)గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆదివారం క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, క్రీడలు మానసికోల్లాసానికి ఎంతగానో దోహదపడుతాయన్నారు. క్రీడల్లో గెలుపోటములు సర్వసాధారణమన్నారు. క్రీడా స్ఫూర్తితో రాణించి మంచి గుర్తింపు పొందాలని సూచించారు. యువత క్రీడల్లో రాణించేందుకు ప్రభుత్వాలు సైతం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రోత్సహిస్తుందన్నారు.క్రీడల్లో రాణించిన యువతకు మంచి భవిష్యత్ ఉంటుందని సూచించారు. ఈ క్రీడల్లో సర్పంచ్ రాధాబాయి,నాయకులు మాన్కుపటేల్, భరత్, గణేశ్, దత్తు నిర్వాహకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జగదాంబాదేవి జాతర

లింగాపూర్: కొనసాగుతున్న క్రికెట్ పోటీలు

లింగాపూర్, జనవరి14 : మండలకేంద్రంలో జగదాంబాదేవి జాతర,పూజా మహోత్సవాలు కొనసాగిస్తున్నాయి.లొద్దిగుడ,పిక్లతండా,మోతిపటార్,కొత్తపల్లి,కింనాక్‌తండా, ఎల్లాపటార్,కంచన్‌పల్లి,చిన్నదాంపూర్ తదితర గ్రామాల్లోని భక్తులు ఆదివారం అత్యంత భక్తి శ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు. నైవేద్యాలను సమర్పించారు. ఈ జాతర ఉత్సవాలు ఈనెల 12న ప్రారంభమై 25వరకు కొనసాగనున్నట్లు నిర్వాహకులు గ్రామ్‌నాయక్, కిరణ్ నాయక్‌లు తెలిపారు.ప్రతీ యేట 15రోజుల పాటు జగదాంబదేవి జాతర ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నదని తెలిపారు. ఈ జాతర మహోత్సవాల్లో భాగంగా క్రికెట్, తాడులాగుడు, వాలీబాల్, కుస్తీ, కబడ్డీ ఆటల పోటీలను నిర్వహిస్తామన్నారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహుకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

రసవత్తరంగా కబడ్డీ పోటీలు

కెరమెరి: కబడ్డీ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

కెరమెరి, జనవరి 14: మండలంలోని సాకడ(శ్యాంరావ్‌గూడ)లో రెండో రోజు కబడ్డీ పోటీలు రసవత్తరంగా కొన సాగుతున్నాయి. ఇప్పటి వరకు మొత్తం 26 జట్లు పాల్గొనగా గెలుపు కోసం నువ్వా నేనా అనే రీతిలో పోటాపోటీగా తలపడుతున్నాయి. గత 24 సంవత్సరాలుగా సాకడలో స్వర్గీయ పెందోర్ జంగుపటేల్ స్మారక క్రీడా పోటీలను ఓం జై శ్రీ బాబా యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. దీంతో మారుమూల ప్రాంతాల నుంచి క్రీడాకారులు ఉత్సాహంగా కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్నారు.

సర్పంచ్‌ల పదవీ కాలాన్ని పొడిగించాలి

సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ మెస్రం భూపతి

సిర్పూర్(యు), జనవరి 14 : గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల పదవీ కాలాన్ని పొడిగించాలని సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు మెస్రం భూపతి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 31న పదవీ కాలం ముగుస్తున్న నేపథ్యంలో వచ్చే జూన్ 31 వరకు తమ పదవీ కాలం పొడిగించాలని ప్రభుత్వాన్ని కోరారు. సర్పంచ్ పెందోర్ నాగోరావ్ నాయకులు అర్క నాగోరావ్, ఆత్రం రాజేశ్వర్, తొడసం తీర్మాన్ తదితరులు ఉన్నారు.